క్లుప్తంగా

ఉరుకుందలో ఘనంగా గణపతి పూజ


గణపతి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం వద్ద గణపతి పూజ, గణపతి హోమం నిర్వహించారు. ఆదివారం సంకట చతుర్థి కావడంతో ఈ పూజలు చేపట్టారు. ఈనెల 3న మహా కుంభాభిషేకం జరగడం, మొదటి సారిగా ఆలయం వద్ద గణపతి విగ్రహ ప్రతిష్ఠ జరగడంతో హోమంతో పాటు పూజల్ని చేపట్టినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఆలయ అర్చకులు హోమ కార్యక్రమాన్ని నిర్వహించగా దర్శనానికి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు. దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను చేపడుతున్నట్లు ఈఓ తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం భక్తులు విరివిగా విరాళాలు అందించి సహకరించాలని కోరారు.

కష్టపడిన వారికి పదవులు ఇవ్వండి

కోసిగి: పార్టీ కోసం కష్టపడిని వారికి గుర్తింపు ఇచ్చి పదవులు ఇవ్వాలని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు పెండేకంటి రాముడు, ఉపాధ్యక్షుడు కురువ మారెన్న, పలువురు మండల నాయకులు కోరారు. ఆదివారం కోసిగి బీజేపీ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ లేని ప్రాంతంలో 2018 నుంచి కష్టపడి మండలంలోని 26 గ్రామాల్లో పర్యటించి పార్టీ బలోపేతానికి కృషి చేశామన్నారు. అయితే బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి కోసిగి మండలంలో ఏనాడు పార్టీలో తిరగని వ్యక్తిని పార్టీ మండల అధ్యక్షుడిగా ఎంపిక చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి దృష్టికి తీసుకెళ్లుతామన్నారు. నాయకులు ఆర్లబండ ఉసేని, తమ్మారెడ్డి, కడదొడ్డి ఈరమ్మ, గోపాల్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివస్వాముల ఆధ్వర్యంలో అన్నదానం


పూజచేస్తున్న శివస్వాములు

ఆదోని రూరల్: మండలంలోని నెట్టేకల్ గ్రామంలో ఆదివారం శివస్వాముల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని కొండపై వెలిసిన శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తుల మధ్య అన్నదానం చేపట్టారు. ముందుగా శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భిక్షభోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు రామంజిస్వామి, అమరేష్‌గౌడ్, ఈరన్నగౌడ్, విజ్జిసింగ్, మహేష్, రామంజి, మంజు, బోయ వీరేష్, రవి, తిమ్మారెడ్డి, వీరభద్ర, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక


నూతన కార్యవర్గంతో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్

ఆదోని సెంట్రల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేసేందుకు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్ తెలిపారు. ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో 25 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్లా, జిల్లా కార్యదర్శిగా రంగప్ప, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, సాయి ఉదయ్, విజయ్ సంయుక్త సహాయ కార్యదర్శులుగా రంజిత్, అమర్, అంజి మరో 18 మందిని కమిటీ సభ్యులుగా ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యారంగ సమస్యలపై అలసత్వం ప్రదర్శించకుండా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఆదోని పట్టణంలో డిగ్రీ కళాశాలకు నూతన భవనంతో పాట మెడికల్ కళాశాల పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున అందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు.

రేపు బండలాగుడు పోటీలు

దేవనకొండ: మండలంలోని కొత్తపేట గ్రామంలో మస్తాన్‌వలిబాబా ఉరుసు సందర్భంగా ఈనెల 18న అంతర్రాష్ట బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.15 వేలు, ఆరో బహుమతి రూ.10 వేలు అందజేస్తామన్నారు.

కొలిచే వారి కొంగుబంగారం

రేణుక ఎల్లమ్మ

- ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాలు
- నేడు మహారథోత్సవం
- భారీగా తరలిరానున్న భక్తులు
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు


ప్రత్యేక అలంకరణలో రేణుక ఎల్లమ్మ దేవి


ముస్తాబైన రథం

కోసిగి: భక్తుల పాలిట కొలిచే వారి కొంగుబంగారంగా, కోసిగి ప్రజల ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్నారు శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి. అమ్మవారి జాతర ఆదివారం ప్రారంభమైంది. ఆలయ అర్చకులు గొరీష్ గౌడ, మూర్తి గౌడల ఆధ్వర్యంలో నూతన పట్టువస్త్రాలంకరణ, ఫల, పుష్పాలు, వెండి, బంగారు కవచ అలంకరణలు గావించి మహామంగళ హారతులతో ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. సోమవారం వేకువ జామున నుంచి భక్తులు వేలాది తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించనున్నారు. సాయంత్రం 5గంటల నుంచి దొరల ఇంటి నుంచి పూర్ణకుంభంతో ఆలయం చెంతకు చేరుకుని నైవేద్యం సమర్పించి రథోత్సవ ఊరేగింపుకు అంకుర్పారణ పలుకునున్నారు. వేలాది మంది భక్తుల మధ్య రథోత్సవం అమ్మవారి పాదాల చెంత వరకు లాగి తిరిగి యథావిధిగా గమ్యస్థానంకు చేర్చుతారు. అమ్మ వారి దర్శనార్థం, రథోత్సవం తిలకించేందుకు జిల్లా నుంచే కాక, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు.

అమ్మవారి ఆలయ చరిత్ర ..

పూర్వం కోసిగి ప్రాంతంలో కరువుకాటకాలతో అల్లాడి పోతున్న తరుణంలో పెద్ద పెద్ద భూస్వాములు, రైతులు సైతం బతుకుదెరువు కోసం మూటముళ్ల సర్దుకుని పిల్లాపాపలతో వలస వెళ్లేవారు. ఈ తరుణంలో కోసిగికు చెందిన ఓ రైతు నీరు సమృద్ధిగా నీరు లభ్యమయ్యే కర్ణాటక రాష్ట్రం నీరుమాన్వికి తరలి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని తిరుగు పయనంలో ఓ పెద్ద గంపలో మూటాముళ్లె, సామాన్లు వేసుకొని కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామానికి చేరుకున్నారు. ఇంట్లో సామాన్లు సర్దుతుండగా గంపలో నుంచి అమ్మవారి మూలవిరాట్ (చెక్క బొమ్మ) నుంచి బయట పడింది. అయితే ఆ రైతు చెక్క బొమ్మ అని ఓ మూలకు పడేశాడు. దీంతో రాత్రిల్లో గజ్జల సవ్వడి, మెరుపుల శబ్దాలు వినిపించడంతో రైతు భయపడి మరో సమీప రైతుతో చెప్పాడు. మరుసటి రోజున అదేశబ్దం వినిపించడంతో ఆ రైతులు గట్టి అరిచి మీకు ఏమి కావాలని ప్రశ్నించగా.. నేను ఎల్లమాంబను, నన్ను గ్రామ శివారులో కొలవుంచి పూజలు చేస్తే మీకు, మీ గ్రామానికి మంచి జరుగుతోందని అమ్మవారు సెలవిచ్చారని గ్రామ పెద్దులు చెబుతారు. దీంతో ఆ నాటి నుంచి విశాలమైన ప్రాంతంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు కొనసాగిస్తున్నారు.

అమ్మవారి ప్రత్యేకత

అమ్మవారికి కుడుములు, గుగిళ్లు, నైవేద్యంగా భక్తులు సమర్పించి, నారికేలలు కొట్టి మొక్కులు చెల్లిస్తారు. చర్మవాధులు ఉన్న వారు అమ్మవారిని తలచుకుని కేజీ పావు ఉప్పు సమర్పిస్తే తగ్గిపోతాయని ఇక్కడ భక్తుల అపార నమ్మకం. జాతర రోజున వేలల్లో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసుకోవడం అనావాయితీగా కొనసాగుతోంది.

భక్తులకు అన్ని సౌకర్యాలు

అమ్మవారి జాతరకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈఓ తిరుమలేశ్వ రెడ్డి, ఆలయ అర్చకులు గొరీష్ గౌడ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు క్యూ లైన్‌లో వచ్చి అమ్మవారి దర్శనం చేసుకునేలా అవకాశం కల్పించారు. జాతరలో స్నానానికి, బాత్ రూమ్ వసతి, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు.

పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు



కోసిగి జాతరలో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పారిశుద్య కార్మికులచే ఎప్పటికప్పుడు శుభ్రం చేయించేలా చూస్తున్నాం. పంచాయతీ తరుపున భక్తుల సౌకర్యార్థం 10 ట్యాంకర్లతో తాగునీటి వసతి ఏర్పాటు చేశాం. గ్రామానికి సాతనూరు ఎస్ఎస్ స్కీమ్ నుంచి నీటి సరఫరా కొనసాగుతోంది. భక్తులకు, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూస్తాం. **– తిరుమలేశ్వ రెడ్డి, ఈఓ, కోసిగి**

భారీ బందోబస్తు ఏర్పాటు చేశాం



జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది, అసాంఘిక కార్యాకలపాలు చోటుచేసుకోకుండా భారీ పకడ్బందీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశాం. 150 మందికి వరకు పోలీసులు డ్యూటీలో ఉంటారు. ముగ్గురు సీఐలు, ఏడు గురు ఎస్ఐలు, 10 ఏఎస్ఐలు, మిగిలిన వారు కానిస్టేబుల్స్, మహిళ కానిస్టేబుల్స్‌తో బందోబస్తు చేపట్టాం. జాతరలో ఎవరు బ్యానర్లు, ఫ్లెక్సీలు కట్టకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేశాం. గుడి దగ్గర పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం.

– మంజునాథ్, సీఐ

వైభవంగా కలశ ప్రతిష్ట


ప్రత్యేక అలంకరణలో శాంతమల్లేశ్వరస్వామి


శాస్త్రోక్తంగా కలశ ప్రతిష్టాపన చేస్తున్న పండితులు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని ఎమ్మిగనూరు రోడ్డులో వెలిసిన శాంతమల్లేశ్వరస్వామి ఆలయ గోపురానికి ఆదివారం శాస్త్రోక్తంగా కలశ పూజ, కలశ ప్రతిష్టాపన జరిగింది. మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని చిన్మయమిషన్ ఆధ్వర్యంలో కలశానికి వేకువజామున కుంభాభిషేకం, హోమాలు, శాంతిమల్లేశ్వరస్వామికి విశేష అభిషేకం, నర్మద నది జలాలతో అభిషేకాలు జరిగాయి. అలయ అధ్యక్షులు హెగ్గటి ప్రతాప్ మాట్లాడుతూ మాఘమాసం సందర్భంగా ప్రతిఏటా శాంతిమల్లప్పస్వామి కొండలో లింగానికి ప్రత్యేకహోమాలు, పూజలు, అభిషేకాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ బ్రహ్మాచారి నారాయణ చైతన్య, పురోహితులు రాజుశర్మ, ఆలయ కమిటీ సభ్యులు రఘునాథ్, రమేష్, శ్రీనివాసులు, రాముడు, జగదీష్, సతీష్ పాల్గొన్నారు.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి

ఆదోని టౌన్: న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది మృతిచెందిన ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు సాయినాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది మృతిచెందం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సంఘటన మరోసారి రైల్వేల వైఫల్యాన్ని, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేసిందన్నారు. ప్రయాగ్‌రాజ్‌కు పెద్ద సంఖ్యలో భక్తులు వెళ్తున్నందున స్టేషన్‌లో మెరుగైన ఏర్పాట్లు చేసి ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దిలీప్‌దోక, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతీరావు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు


వాహనదారులకు బ్రీతింగ్ అనలైజర్ ద్వారా శ్వాస పరీక్షలు చేస్తున్న పోలీసులు

గోనెగండ్ల : మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ వద్ద పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. వాహనదారులకు బ్రీతింగ్ అనలైజర్ ద్వారా శ్వాస పరీక్షలు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు. సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్య చర్యలు తప్పవని, అలాగే కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ద్వారా మీతో పాటు ఇతర వాహనదారులు ఇబ్బందులు పడతారని చెప్పారు. ఇప్పటి నుంటి ప్రతి రోజూ రోడ్డుపై వాహనల తనిఖీ చేపట్టి బ్రీతింగ్ అనలైజర్ శ్వాస పరీక్షలు చేస్తామని తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మవిశ్వాసం


పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): వ్యక్తిగత నైపుణ్యానికి నిదర్శనం బెల్ట్ గ్రేడింగ్ పోటీలు అని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలను జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఒత్తిడి అధిగమించాలంటే క్రీడలు అవసరమన్నారు. మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల వల్ల ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. విపత్కర పరిస్థితును ధైర్యంగా ఎదుర్కొనవచ్చన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు బెల్టులు ప్రధానం చేశారు. తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారా స్పోర్ట్స్‌లో 22 పతకాలు

ఈనెల 2వ తేదీన మంగళగిరిలో నిర్వహించిన పారా స్పోర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు 22 పతకాలు సాదించారు. బంగారు 11, వెండి 8 కాంస్యం 3 పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్లప్ప ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌ను కలిశారు. క్రీడాకారులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు చెన్నైలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పారా స్పోర్ట్స్‌లో కర్నూలు నుంచి గౌతమ్, సాయి మర్నాద్, గణేష్, దినకర్, శివానీ ఎంపికైనట్లు వెల్లడించారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు


శ్రీశైలానికి పాదయాత్ర ప్రారంభిస్తున్న శివస్వాములు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారం సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జలాభిషేకం, మహా మంగళహారతి, సుప్రభాతసేవ, బండరార్చన, కుంకుమార్చనతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. స్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక, ఆంధ్ర ప్రాంతం నుంచి భక్తులు తరలి వచ్చారు. కొందరు భక్తులు అన్నదానం, ఇతర కార్యక్రమాలు చేపట్టారు. శివమాల ధరించిన నెరణికి తదితర గ్రామాలకు చెందిన దాదాపు 30 మందికి పైగా శివస్వాములు మాళ మల్లేశ్వరస్వామి సన్నిధిలో ఇరుముడి కట్టుకుని శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆస్పరి మఠంలో అన్నదానం చేపట్టారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని రూరల్: 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, 104 జిల్లా కార్యదర్శి పెద్దయ్య, ఉపాధ్యక్షులు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో 104 ఉద్యోగుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ కొత్తగా తయారుచేసిన ఆర్ఎఫ్‌పీలో డీఈఓలకు జీతభత్యాలు విషయంలో ఎటువంటి మార్పు జరగలేదన్నారు. అదేవిధంగా స్లాబ్ విషయంలో స్పష్టత లేదని, పీఎఫ్ అండ్ ఈఎస్ఐ విషయంలో స్పష్టత లేదని చెప్పారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఆదోని సెంట్రల్: పురపాలక ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ సూచించారు. విజయవాడలోని ఎస్టీయూ సంఘం ఉపాధ్యాయవాణి, అభివృద్ధి కమిటీల సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పాఠశాల సహాయకులు, ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయించాలన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి


రైతులకు కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

ఆదోని రూరల్: మిర్చి గిట్టుబాటు ధర, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాషా పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని చిన్నహరివాణం, సంతకూడ్లూరు గ్రామాల్లో పర్యటించి ధర్నాకు సంబంధించిన కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వేసిన మిరప రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారని, తెగులు సోకి మిరప రైతులు పంట దెబ్బతిందన్నారు. ఈనెల 17వ తేదీన మిర్చి రైతులతో చేపట్టే ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకుడు అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దస్తగిరి స్వామి ఉరుసు


దస్తగిరి స్వామి గుర్రాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో ఆదివారం జియారత్ వేడుకలతో దస్తగిరి స్వామి ఉత్సవాలు ముగిశాయి. ఈసందర్భంగా భక్తులు స్వామివారి దర్గాను దర్శించుకు సమర్పించారు. దస్తగిరి స్వామి గుర్రాన్ని భక్తులు మేళతాళాలతో ఊరేగించారు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


గంగపూజ చేసేందుకు కలశంతో వెళ్తున్న భక్తులు


వధూవరులుగా స్వామి, అమ్మవారు

కమనీయం.. పార్వతీపరమేశ్వరుల కల్యాణం

ఆదోని అర్బన్: మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులో వేకువజామున శివపార్వతి కల్యాణోత్సవం జరిగింది. అనంతరం శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న ఆదోని పరిసర ప్రాంతాల భక్తులకు దాతల సాయంతో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమ నిర్వాహకుడు అల్యూకారిమఠం మహర్షి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వేకువజామున శివపార్వతుల కల్యాణం, గంగపూజ, ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమానికి ప్రముఖులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు పాల్గొని శివపార్వతులను దర్శించుకుని, పాదయాత్రకు వెళ్తున్న భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

హరహర మహాదేవ... శంభోశంకర


ఊరేగింపులో చిందులు వేస్తున్న శివస్వాములు,


వాహనంలో శివలింగాన్ని ఊరేగిస్తున్న శివస్వాములు

ఆదోని అర్బన్: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం శివమాలధారులు, గురుస్వామి శైలేంద్రనాథ్ ఆధ్వర్యంలో శివయ్య ఊరేగింపు భక్తిశ్రద్ధలతో జరిగింది. ప్రధాన రహదారులన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. ఓంనమఃశివాయ అంటూ శివమాలధారులు చిందులు వేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. స్థానిక శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు సంతపేట, పూల బజార్, చిన్నమార్కెట్, నిర్మల్ థియేటర్, కోట్ల కూడలి, పాత బస్టాండు మీదుగా శంభులింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకుంది.

పాఠశాలల మూసివేత తగదు


మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ

ఎమ్మిగనూరుటౌన్: విద్యాశాఖ సంస్కరణల పేరుతో పాఠశాలలను మూసివేత తగదని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజి.వెంకట్రాముడు, గట్టు తిమ్మప్ప అన్నారు. ఏ ఒక్క పాఠశాలను మూసి వేయకూడదని, వున్న పోస్టులను రద్దు చేయకుండా వుండాలని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని డీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలన్నారు. విద్యాశాఖ చేపట్టిన సంస్కరణల్లో ప్రాథమికోన్నత పాఠశాలలు, ప్లస్ టూ పాఠశాలలను రద్దు చేయకూడదని కోరారు. జీఓ నెంబర్ 117ను సంపూర్ణంగా రద్దు చేసి మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతిని ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఈఎల్‌ల బకాయిలు రూ.21వేల కోట్లను సత్వరం విడుదల చేయాలన్నారు. రెండు విడతల కరువు భత్యాన్ని మంజూరు చేయాలని, క్లస్టర్ల పేరిట మండల విద్యాశాఖ అధికారుల పోస్టులను రద్దు చేసే యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీటీఎఫ్ ఉపాధ్యాయ క్రాంతి పత్రిక సంపాదకులు రత్నం ఏసేపు, రాష్ట్ర కౌన్సిలర్లు మోహన్, గోట్ల చంద్రశేఖర్, రవీంద్ర, జిల్లా నాయకులు నాగరాజ్‌గౌడ్, రామన్న, పాటిల్ ఈశ్వర్‌రెడ్డి, వెంకటేషప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య


వేముగోడులో రైతుల రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ

గోనెగండ్ల : వ్యవసాయ సేవలను సులభతరం చేసేందుకు ప్రభుత్వం భూమి గల ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య తీసుకొచ్చిందని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత తెలిపారు. ఆదివారం మండలంలోని వేముగోడు గ్రామంలోని రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు గోనెగండ్ల మండలంలో 5,673 మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తి అయ్యిందని, ఇంకా దాదాపు 9వేల మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాన్నారు.

ప్రభుత్వ సేవలు పొందేందుకు అధికార గుర్తింపు

రైతు ఐడీ అనేది రైతు రిజిస్ట్రర్ పోర్టల్‌లో నమోదు చేసి తరువాత ప్రతి రైతుకు కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్య. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ పథకాలు, ఇతర సేవలు పొందటానికి ఇది అధికార గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. రైతు ఐడీ నుంచే ప్రయోజనాలు నేరుగా రైతుకే చేరుతాయని చెప్పారు. ఇది నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీలు, పంట రుణాలు, పంట బీమా పథకాలు పొందేల చూస్తుందన్నారు. సేవలను సులభతరం పొందటానికి కాగిత ఆధారిత విధానలు లేకుండా రైతులకు పంట రుణాలు, పంట సేకరణ, ఇతర సేవలు పొందవచ్చని చెప్పారు. పారిదర్శకత ప్రక్రియను సులభతరం చేస్తుందని, మోసాలను తగ్గిస్తుందని, రైతుల కిసాన్ కార్డ్, పంటల బీమా ప్రయోజనాల వంటి క్రెడిట్ సౌకర్యం పొందవచ్చని వివరించారు. రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట నష్టం, పంటబీమా వంటి పథకాలు అందుతాయని తెలిపారు.

ఐడీని ఇలా నమోదు చేసుకోవాలి..

రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఆధార్ కార్డు, ఆధార్ లింక్ నంబర్, పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకొని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని ఏడీఏ తెలిపారు. రైతు మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది కాబట్టి రైతు సేవా కేంద్రానికి వెళ్లి వారివారి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లోని ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, మంత్రాలయం మండలాల రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకొని ఐడీని పొందాలని ఏడీఏ సూచించారు.